# లీజు రద్దుకూ సిద్ధం?

- సుప్రీం తీర్పును బట్టి నిర్ణయం
- ప్రస్తుతానికి కార్యకలాపాల నిలిపివేత
- దిగొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్ - న్యూస్‌టుడే

ఓబుళాపురం, బళ్లారి మైనింగ్ కంపెనీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఇనుప ఖనిజం తవ్వకాలను నిలిపి వేయాలని, ఇప్పటికే సిద్ధంగా ఉన్న ఖనిజం రవాణాను ఆపేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. లీజు రద్దుపైనా ఆలోచన చేసినా సుప్రీం తీర్పు తర్వాత దానిపై నిర్ణయం తీసుకోవాలని నిశ్చయించింది. సుప్రీం కేంద్ర సాధికార కమిటీ నివేదిక, లేఖ, త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదికలపై చర్చించేందుకు మంగళవారం సాయంత్రమిక్కడ ముఖ్యమంత్రి రోశయ్య మంత్రులు, అధికారులతో అత్యవసరంగా భేటీ అయ్యారు. ప్రస్తుతానికి తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని, లీజు రద్దుపై తర్వాత నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించింది. తవ్వకాల నిలిపివేతపై న్యాయపరమైన ఆటంకాలు ఎదురు కాకుండా చర్యలు తీసుకోవాలనే యోచనతో ప్రభుత్వం న్యాయ నిపుణుల సలహా కోరింది. అవి వచ్చిన వెంటనే నిలిపివేతపై ఆదేశాలు జారీ చేయనుంది. బుధవారం ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

గనులశాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రమాకాంతరెడ్డి, అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జానకి కొండపి, పరిశ్రమలశాఖ కార్యదర్శి వీరభద్రయ్య, సీఎం పేషీ అదనపు కార్యదర్శి జవహర్‌రెడ్డి, అడ్వొకేట్ జనరల్ సీతారామమూర్తి, న్యాయశాఖ కార్యదర్శి అప్పారావు, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సీఈసీ నివేదిక, త్రిసభ్య కమిటీ నివేదికల గురించి చర్చించారు. ఓఎంసీ సహా 6 గనుల్లో మైనింగ్‌ను నిలిపి వేయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సాధికార కమిటీ సూచించిందని, ఇప్పటికే తవ్విన ఇనుప ఖనిజం రవాణానూ ఆపేయాలని సిఫార్సు చేసిందని ముఖ్యమంత్రికి అధికారులు తెలిపారు. ఓఎంసీలో పలు పొరపాట్లు జరుగుతున్నాయని అటవీశాఖ త్రిసభ్య కమిటీ కూడా నివేదిక ఇచ్చిందని చెప్పారు. మరోవైపు ఓఎంసీ విషయంలో గనులు, అటవీశాఖల అధికారుల వ్యవహార శైలిపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనికి బాధ్యులెవరని ఆయన ప్రశ్నించారని తెలిసింది. ముందే మేల్కోనందువల్లే పరిస్థితి ఇంత దాకా వచ్చిందని ఆయన ఆగ్రహం వ్యక్తపరిచారని సమాచారం.

సీఈసీ, త్రిసభ్య కమిటీ సూచనల ఆధారంగా ఆ సంస్థల కార్యకలాపాలను కట్టడి చేయాలని నిర్ణయం తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి సమావేశంలో వెల్లడించారు. కంపెనీల నుంచి న్యాయపరమైన సమస్యలు ఏమైనా ఎదురయ్యే అవకాశముందా? అని ఏజీని ముఖ్యమంత్రి ప్రశ్నించినట్లు తెలిసింది. దీనిపై అధ్యయనం చేసి సలహా ఇవ్వడానికి కొంత సమయం కావాలని ఏజీ, న్యాయ కార్యదర్శి కోరారు. క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఎట్టి పరిస్థితుల్లోనూ బుధవారంలోగా సలహా ఇవ్వాలని వారికి ముఖ్యమంత్రి సూచించారు. అది అందిన వెంటనే సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి చర్య తీసుకోవాలని సీఎస్ రమాకాంతరెడ్డిని ఆదేశించారు.



ఈ సమావేశంలో గనుల లీజు రద్దుపైనా చర్చ జరిగినట్లు తెలిసింది. నోటీసులు ఇవ్వకుండా నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాదనే అభిప్రాయం ఇందులో వ్యక్తమైంది. అదీగాక ఈ అంశం సుప్రీం కోర్టు పరిధిలో ఉన్నందున తీర్పు రాకముందే అలాంటి నిర్ణయం సాధ్యం కాదని తేల్చారు. అన్ని కోణాల్లో ఆలోచించి... ముందుగా కార్యకలాపాలను ఆపేసి, ఖనిజ రవాణాను నిలిపివేయాలని, సుప్రీం కోర్టు తీర్పు వచ్చాక లీజుపై తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు.

## అప్పటికప్పుడే...

ముందుగా నిర్ణయించిన షెడ్యూలులో గనులపై సమావేశం లేదు. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో దీనిని ఏర్పాటు చేశారు. అంతకు కొద్ది గంటల ముందు కేంద్ర సాధికార కమిటీ లేఖ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రమాకాంతరెడ్డికి అందింది. ఆ వెంటనే అటవీ శాఖ త్రిసభ్య కమిటీ నివేదికను ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జానకి సీఎస్‌కు అందజేశారు. పలు పొరపాట్లు జరిగినట్లు కమిటీ తేల్చినట్లు వెల్లడించారు. ఈ సమాచారం అందిన వెంటనే సీఎంతో సీఎస్ సమావేశమయ్యారు. ఆ నివేదికను ఆయనకు అందించారు. వెంటనే ఓఎంసీపై చర్చించేందుకు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రులిద్దరినీ వెంటనే సమావేశానికి హాజరు కావాలని సూచించడంతో వారు హుటాహుటిన వచ్చారు. సంబంధిత అధికారులను అప్పటికప్పుడే పిలిపించారు. సెలవులో ఉన్న పరిశ్రమలశాఖ మాజీ కార్యదర్శి శ్రీలక్ష్మిని సైతం ఈ సమావేశానికి పిలిచారు. అయితే ఆమె సీఎం నిర్వహించిన సమావేశానికి వెళ్లలేదు. సీఎస్‌తో సమావేశమై వెనుదిరిగారు.

## న్యాయ సలహా వచ్చిన వెంటనే చర్య: సీఎస్

న్యాయ నిపుణుల సలహా ఆధారంగా గనులపై తగిన నిర్ణయం తీసుకుంటామని సీఎస్ రమాకాంతరెడ్డి సమావేశానంతరం విలేకరులకు తెలిపారు. తమకు సీఈసీ నివేదికతోపాటు అటవీశాఖ త్రిసభ్య కమిటీ నివేదిక అందిందని, దీనిపై ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారని వెల్లడించారు. గనుల లీజును రద్దు చేస్తారా? తవ్వకాలను నిలిపివేస్తారా? అని విలేకరులు ప్రశ్నించగా అన్ని అంశాలనూ పరిశీలించి అత్యున్నత స్థాయిలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. న్యాయ సలహా ఎప్పుడు అందుతుంది? నిర్ణయం ఎప్పుడు తీసుకునే వీలుందని ప్రశ్నించగా బుధవారం ఉదయం 12 గంటల ఒక నిమిషానికి తనను సంప్రదించాలని చమత్కరించారు. బుధవారం ముఖ్యమంత్రి అందుబాటులో ఉండటం లేదు కదా.. నిర్ణయం వెలువడుతుందా? అని ప్రశ్నించగా ఆయన రాష్ట్రంలోనే ఉంటున్నారని, ఫోన్‌ద్వారాగానీ, ఫ్యాక్స్‌ద్వారా గానీ ఆదేశాలు వస్తాయని చెప్పారు.

అంతకు ముందు గనులశాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సైతం విలేకరులతో మాట్లాడుతూ ఇదే విషయాన్ని ధ్రువీకరించారు. సుప్రీం సాధికారిక కమిటీ, అటవీ శాఖ త్రిసభ్య కమిటీ నివేదికలు అందాయని, వాటి ఆధారంగా చర్యకోసం న్యాయ నిపుణుల సలహా తీసుకుంటామని చెప్పారు. బుధవారం ముఖ్యమంత్రి అందుబాటులో లేకున్నా సీఎస్ నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

